క్లుప్తంగా

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



ఈఓకు విరాళ చెక్కును అందజేస్తున్న దాత

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి వైఎస్సార్ కడప జిల్లా వేంపల్లికి చెందిన దేవదుర్గం నాగభూషణం రూ.లక్ష విరాళం ఇచ్చారు. ఈఓ బాపిరెడ్డి విరాళాన్ని స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వారికి స్వామి అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. వేదపండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

రుయాకు వీల్ చైర్ల వితరణ



వీల్ చైర్లను అందజేస్తున్న రమాదేవి

తిరుపతి తుడా: స్థానిక రుయా ఆస్పత్రికి రేణిగుంటకు చెందిన దగ్గుపాటి రమాదేవి తన కుమారుడి జ్ఞాపకార్థం రూ.లక్ష విలువ చేసే 12 వీల్ చైర్లను బుధవారం సూపరింటెండెంట్ డాక్టర్ రాధ, అధికారులకు అందజేశారు. ఈసందర్భంగా ఆమెను రుయా అధికారులు అభినందించారు.

ప్రభుత్వాస్పత్రికి వైద్యపరికరాలు



ఆస్పత్రి పరికరాలను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి అధునాతన వైద్యపరికరాలు అందించడం శుభపరిణామమని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మిత్రులు మాక్స్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ అధినేత బీవీవీఎస్ఎన్ రాజు రూ.10 లక్షలు విలువైన అధునాతన వైద్య పరికరాలను సీఎస్ఆర్ ఫండ్స్ కింద అందజేశారు. వాటిని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ద్వారా ఆస్పత్రికి అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి బొజ్జల రిషితారెడ్డి, టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్ పాల్గొన్నారు.

కుట్టు శిక్షణ శిబిరం ప్రారంభం



శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ భార్గవి

ఏర్పేడు: మండలంలో ఆర్ఎస్ఈటీఐ, సర్ప్–డీఆర్డీఏ ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం టైలరింగ్ శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. శిక్షణ శిబిరాన్ని తహసీల్దార్ ఎం.భార్గవి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఏర్పేడు 1, 2 గ్రామ సమాఖ్యల్లోని 35 మందిని ఒక బ్యాచ్‌గా ఏర్పాటు చేసి 30 రోజులపాటు శిక్షణ ఇస్తారని తెలిపారు. మహిళలు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వెలుగు ఏపీఎం ఆదినారాయణ, ఆమందూరు సర్పంచ్ బాలగురునాథం యాదవ్, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే లక్ష్యం



మాట్లాడుతున్న ఎంపీడీఓ సౌభాగ్యమ్మ

ఏర్పేడు: 2030నాటికి దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారందరిని ఆర్థిక, సామాజిక పురోగతి దిశగా తీసుకొచ్చి పేదరిక నిర్మూలనకు కృషిచేయాలని ఏర్పేడు ఎంపీడీఓ డాక్టర్ సౌభాగ్యమ్మ అన్నారు. ఏర్పేడు ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో బుధవారం మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లకు పంచాయతీ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్‌పై శిక్షణనిచ్చారు. పంచాయతీలో ప్రజారోగ్యం, విద్య, మౌలిక సదుపాయాల కల్పనలో పంచాయతీ కార్యదర్శుల పాత్రను వివరించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రమణకుమార్ పాల్గొన్నారు.

చైనా దేశస్తుడిని ఈడీ అధికారుల విచారణ

రేణిగుంట: రేణిగుంటలో ఉంటున్న ఓ చైనా దేశస్తుడి ఇంట్లో బుధవారం రాత్రి ఈడీ అధికారులు సోదాలు నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది. గురవరాజు పల్లి సమీపంలోని శ్రీకాళహస్తి రహదారి పక్కన ఉన్న భవనంలో చైనాకు చెందిన ద్యూయాంగస్ ఉంటున్నారు. బుధవారం అతన్ని అదుపులోకి తీసుకుని ఇంట్లో ఈడీ అధికారులు సోదాలు చేశారు. బిగ్ కిచెన్ పేరుతో చైనా సంస్థల్లో పనిచేసే చైనీయులకు ఆహారం సరఫరా చేసేవాడని తెలుస్తోంది. వీసా నిబంధనలను ఉల్లంఘించడం, వివిధ కంపెనీల పేరుతో వ్యాపారాలు నిర్వహిస్తూ పన్నులు చెల్లించకుండా ఉండడంతో, ఢిల్లీ, చెన్నై నుంచి వచ్చిన ఈడీ అధికారులు యాంగస్ నివాసంలో సోదాలు నిర్వహిస్తున్నారని తెలిసింది. ఈ క్రమంలో ఏర్పేడు మండలం వికృతమాలలో ద్యూయాంగస్ నిర్వహిస్తున్న స్క్రాప్ గోదాములో సైతం ఈడీ అధికారులు సోదాలు చేశారు. అదేవిధంగా రేణిగుంటలోని అతడి ఇంటి వద్దకు బ్యాంకు అధికారులను పిలిపించి విచారించినట్లు తెలిసింది. 2021 సంవత్సరంలో ఇతనిపై రేణిగుంట పోలీస్ స్టేషన్‌లో వీసా ఉల్లంఘన, ఫోర్జరీ, అనధికారికంగా నివాసం ఉండడంపై పోలీసులు అరెస్ట్‌చేసి కేసు నమోదుచేశారు. అతని పాస్‌పోర్టు సీజ్‌చేసిన రేణిగుంట పోలీసులు తిరుపతి కోర్టుకు అప్పగించారు. ప్రస్తుతం ఆ కేసు విచారణలో ఉంది. ప్రస్తుతం ఈడీ అధికారుల విచారణకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రోడ్లు చూడు బాబూ!

- అధ్వాన్నంగా నియోజకవర్గ రహదారులు
- వర్షాలకు అడుగుకొక మడుగు
- నరకప్రాయంగా ప్రయాణికుల అగచాట్లు



మన్నసముద్రం రోడ్డు దుస్థితి



వికృతమాల రోడ్డు దుస్థితి

ఏర్పేడు: తాము అధికారంలోకి వస్తే రహదారుల రూపురేఖలు మారుస్తామని, సింగపూర్ రోడ్లను తలపించేలా వేస్తామని గత ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు ఊదరగొట్టారు. తీరా అధికారం చేపట్టాక, రోడ్లను దుస్థితిలో వదిలేసి ప్రజలను అవస్థలకు వదిలేశారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని గ్రామీణ రోడ్లు, ఆర్అండ్‌బీ రోడ్లు ఛిద్రమై అడుగు అడుగునా గుంతలమయంగా రహదారులు రూపాంతరం చెందాయి. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్లు మరింత ఛిద్రమై గుంతల్లో వర్షపు నీరు చేరి మడుగులను తలపిస్తున్నాయి. దీంతో వాహనచోదకులకు ప్రయాణం కత్తిమీద సాముగా మారుతోంది. రాత్రి వేళల్లో జారి పడుతున్నారు. పట్టించుకోవాల్సిన పాలకులు మాకేం కనబడడం లేదని ముఖం చాటేస్తున్నారు.

నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోనూ రోడ్లు దుర్భరంగా మారాయి. ఏర్పేడు మండలం మఠ్రిమంద, వికృతమాల, చెల్లూరు, బండారుపల్లి, ముసలిపేడు, సరస్వతికండ్రిగ, పాగాలి, మన్నసముద్రం, పాతవీరాపురం, గుడిమల్లం గ్రామాల్లో రహదారులు గుంతలమయంగా మారి రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వాహనచోదకులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వాహనాలను నడుపుతున్నారు. రేణిగుంట మండలం అన్నాసామిపల్లి, విప్పమానుపట్టెడ, కొత్రమంగళం, కరకంబాడి తారకరామానగర్, సుబ్బయ్యగుంట రోడ్లు గుంతలమయంగా మారాయి. శ్రీకాళహస్తి మండలం తొండమనాడు, వేడాం, రామలింగాపురం, దొమ్మరపాళెం, వేలవేడు, గొల్లపల్లి, కలవగుంట, మేలచ్చూరు గ్రామాలలో రోడ్లు గుంతలమయంగా మారి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అలాగే తొట్టంబేడు మండలం కాసరం, పూడి, చియ్యవరం, విరూపాక్షపురం, కనపర్తి, కంచనపల్లి గ్రామాల్లో రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయి. రహదారుల మరమ్మతుల పేరిట ఆర్అండ్‌బీ అధికారులు పనులు చేపట్టకుండానే నిధులు స్వాహా చేశారన్న విమర్శలున్నాయి.

మన్నసముద్రంలో దారుణంగా రోడ్లు

ఏర్పేడు మండలం మన్నసముద్రం శివారున బండారుపల్లికి వెళ్లే మార్గంలో భారీ లోడుతో కూడిన లారీలు, టిప్పర్లు వెళుతుండడంతో రోడ్డు పెద్ద పెద్ద గుంతలుగా ఏర్పడి అటువైపు వెళ్లే వాహనదారులకు నరకం చూపుతోంది. హైవేలో టోల్‌గేటు ఉండడంతో కొందరు లారీలు మన్నసముద్రం నుంచి కోబాక మీదుగా ఏర్పేడుకు చేరుకుని టోల్‌ఫీజు కట్టకుండా తప్పించుకునేందుకు ఈ మార్గంలో వస్తుండడం, రాత్రి వేళల్లో ఇసుక మాఫియా టిప్పర్ల వల్ల రోడ్డు ఇలా ఛిద్రమైనట్లు స్థానికులు వాపోతున్నారు.

రోడ్డును దారుణంగా మార్చారు



మా గ్రామానికి చెందిన ఎంపీ గురుమూర్తి గతంలో ప్రత్యేక చొరవ తీసుకుని చక్కగా రోడ్లు వేయించారు. కొన్ని నెలల కిందట ఇసుక టిప్పర్లు, ప్రస్తుతం టోల్ గేటును తప్పించుకునేందుకు పలువురు లారీలు, ఓవర్‌లోడు వాహనాలన్నీ ఈ మార్గం గుండా వెళుతుండడంతో రోడ్డు మరింత దారుణంగా మారింది. అధికారులు రోడ్డు మరమ్మతు చర్యలు చేపట్టాలి. భారీ వాహనాలు ఈ మార్గంలో వెళ్లకుండా నిరోధించాలి.

– లోకనాథరెడ్డి, మన్నసముద్రం, ఏర్పేడు మండలం



మఠ్రిమంద రోడ్డు దుస్థితి



రాళ్లు తేలిన మూలకండ్రిగ రోడ్డు



గుంతలమయంగా అన్నాసామిపల్లి రోడ్డు



బురదకుంటగా కాసరం రోడ్డు

వ్యవసాయ డ్రోన్ల వినియోగం ప్రయోజనకరం



మాట్లాడుతున్న శాస్త్రవేత్త రాముకుమార్

ఏర్పేడు: వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం ఎంతో ప్రయోజనకరమని రాస్ కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్త రాముకుమార్ అన్నారు. మండలంలోని పాపానాయుడుపేట రాస్ సేవా నిలయంలో బుధవారం రైతులకు వ్యవసాయ డ్రోన్ సాంకేతికతపై శిక్షణనిచ్చారు. రాస్ కేవీకే, చిత్తూరు ఆత్మ, రాస్ మహిళా భారతి సంయుక్తంగా నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్త రాముకుమార్ మాట్లాడుతూ కూలీల కొరతను అధిగమించడానికి క్రిమి సంహారక మందుల పిచికారీ విషయంలో డ్రోన్లు సాంకేతికత ఉపయోగకరమన్నారు. రైతుల అభ్యున్నతి దృష్ట్యా రాస్ సంస్థ ద్వారా రైతులకు అతి తక్కువ వడ్డీకి రుణాలిస్తున్నట్లు పాపానాయుడుపేట రాస్ ప్రాజెక్టు అధికారి రవి తెలిపారు. మండలంలోని 69 మంది రైతులకు రూ.40 లక్షల రుణాలను పంపిణీ చేశారు. రాస్ మహిళాభారతి క్షేత్రపాలక అధికారి సురేష్, ఎంఐఎస్‌సీ మునిపార్థసారథి, మునీంద్ర, యానిమేటర్ ఎం.ఉష పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

శ్రీకాళహస్తి: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని దర్శ్ బ్యాడ్మింటన్ అకాడమీ చైర్మన్ సుధాకర్ అన్నారు. బ్యాడ్మింటన్ డివిజనల్ స్థాయి ఎంపిక పోటీలు పట్టణంలోని దర్శ్ బ్యాడ్మింటన్ అకాడమీలో బుధవారం ప్రారంభమయ్యాయి. స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి కిషోర్ మాట్లాడుతూ డివిజనల్ స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో గెలుపొందిన వారు ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధిస్తారన్నారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ, పీడీలు హేమకుమార్, లోకనాథం, దర్శ్ బ్యాడ్మింటన్ అకాడమీ కోచ్ పవన్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత పశు వైద్యశిబిరం



పశువులకు వైద్యం అందిస్తున్న పశువైద్యులు

రేణిగుంట: రాస్ మహిళా జ్యోతి మ్యూచువల్ బెనిఫిట్ ట్రస్ట్ ప్రాజెక్ట్ కరకంబాడి శాఖ ఆధ్వర్యంలో బుధవారం వెంకటాపురంలో మెగా పశు వైద్యశిబిరాన్ని నిర్వహించారు. రాస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ వెంకటరత్నం ఆదేశాలు, పొదుపు సంఘాల సంచాలకులు వి.నాగరాజు సూచనల మేరకు రేణిగుంట మండలం అసిస్టెంట్ డైరెక్టర్ సునీత, డాక్టర్ స్రవంతి వారి బృందం ద్వారా పశువులకు వైద్యం అందించారు. రాస్ మహిళా జ్యోతి మ్యూచువల్ బెనిఫిట్ ట్రస్ట్ ప్రాజెక్ట్ అధికారి కె. రవి, చైల్డ్ ఫండ్ ఇండియా ప్రాజెక్ట్ అధికారి ఎస్ రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ముక్కంటి హుండీ లెక్కింపు



కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ హుండీని బుధవారం బుధవారం లెక్కించారు. ఆలయంలో కొట్టు మండపంలో ప్రధాన హుండీలతోపాటు, పరివార దేవత వద్ద హుండీల్లోని భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించారు. ఈ సందర్భంగా ఆలయానికి రూ.2,18,65,233 ఆదాయం వచ్చినట్లు ఈఓ బాపిరెడ్డి తెలిపారు. అలాగే బంగారం 134 గ్రాములు, వెండి 698.5కిలోలు, విదేశీ కరెన్సీ 151 వచ్చినట్లు వివరించారు. ఆగస్టు 30 నుంచి ఈ నెల 7వ తేదీ వరకు ఈ ఆదాయం సమకూరినట్లు తెలిపారు.

సొంత ఆదాయ వనరులపై శిక్షణ



మాట్లాడుతున్న అధికారులు

తొట్టంబేడు: తొట్టంబేడు ఎంపీడీఓ సమావేశ మందిరంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్, డిజిటల్ సహాయకులకు సొంత ఆదాయం వనరులు అనే అంశంపై బుధవారం శిక్షణ కార్యక్రమం జరిగింది. పన్నులు, పరోక్ష పన్నులు, ఇతర ఆదాయ వనరులు సమకూర్చుకోవడంపై అధికారులు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమం ఎంటీటీ వినోద్‌కుమార్, డిప్యూటీ ఎంపీడీఓ భార్గవ్ సత్యం, అధికారులు పాల్గొన్నారు.

పిల్లల భద్రతపై అవగాహన



మాట్లాడుతున్న శారద

రేణిగుంట: మండలంలోని గాజులమండ్యంలోని శ్రీ సాయి గణేష్ విద్యాలయంలో బుధవారం గాజులమండ్యం పోలీసులు విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఏఎస్ఐ శారద మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్లు 112, 181, 1098, 1930 వినియోగించుకోవాలని తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ సుబ్రహ్మణ్యం, పాఠశాల యాజమాన్యం, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో అలసత్వం వద్దు

వరదయ్యపాళెం: అభివృద్ధి పనుల విషయంలో అలసత్వం వహించ వద్దని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో అన్నిశాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలతో ఆయన సమీక్షించారు. తహసీల్దార్ సుధీర్‌రెడ్డి, ఎంపీడీఓ విజయమ్మ పాల్గొన్నారు.


బస్సు ఎక్కాలంటే ఫీట్లు చేయాల్సిందే!



బస్సు ఎక్కేందుకు అవస్థలు పడుతున్న విద్యార్థులు

నాగలాపురం: మండల పరిధిలో విద్యార్థులు బడికి పోవాలన్నా.. బడి నుంచి ఇంటికి వెళ్లాలన్నా నరకయాతన పడుతున్నారు. ఇటు టి.పి.కోట–కన్నావరం నుంచి అటు సత్యవేడు–ఆంబాక్కం నుంచి కొన్ని వందల మంది పిల్లలు నాగలాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఐటీఐ, జూనియర్, డిగ్రీ కళాశాలలో చదువుకుంటున్నారు. విద్యార్థులు రోజు ఉదయం, సాయంత్రం ఆర్టీసీ బస్సులో వెళ్లి చదువుకుని తిరిగి అదే బస్సులో ఇంటికి చేరుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు బస్సులో ఉచిత ప్రయాణమని ప్రకటించినప్పటి నుంచి పిల్లలు బస్సుల్లో కూర్చోవడానికి వీలు లేకుండా ప్రతిరోజూ నిలబడి ప్రయాణించాల్సిన పరిస్థితి వచ్చింది. దీంతో విద్యార్థులు గత్యంతర లేని స్థితిలో ఆ బస్సులోనే వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ముఖ్యంగా టి.పి.కోట–కన్నావరం రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో బస్సు ఆ గుంతల్లో కదుపులకు విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ ఉన్నతాధికారులు అమకు ప్రత్యామ్నాయ మార్గం చూపాలని విద్యార్థులు కోరుతున్నారు.

పంట రక్షణకు చీర పరదాలు



ముసలిపేడులో పంట రక్షణకు పొలం చుట్టూ కట్టిన చీరల పరదాలు

ఏర్పేడు: మండలంలోని ముసలిపేడులో పంట పొలాల్లో వేరుశనగ పంట వేసిన ఓ రైతు అటవీ ప్రాంతానికి శివారున ఉన్న పొలంలో అడవి పందులు వచ్చి పంటను నాశనం చేస్తాయని భావించి పంట రక్షణకు పొలం చుట్టూ పాత చీరలతో పరదాలను కట్టి ఆకర్షణీయంగా మార్చారు. ప్రతి ఏటా ఇక్కడ పందుల బెడద వల్ల వేరుశనగను పండించాలంటేనే రైతులు భయపడిపోతున్నారు. ఓ రైతు అడవి పందులకు చీరలతో కట్టిన పరదాలతో క్లోం వేయడం విశేషం.

తెరుచుకోని ప్రభుత్వ కార్యాలయాలు

- పర్యవేక్షణ లేకపోవడంతో కార్యాలయానికి రాని అధికారులు
- ప్రజలకు తప్పని అవస్థలు



తెరుచుకోని మండల విద్యా వనరుల కేంద్రం



మూసి ఉన్న వ్యవసాయశాఖ కార్యాలయ భవనం

ఏర్పేడు: ఏర్పేడు ఎంఈఓ, వ్యవసాయ శాఖ కార్యాలయాలు బుధవారం ఉదయం 12 గంటలైనా అధికారులు రాకపోవడంతో తలుపులు తెరుచుకోలేదు. గతంలో మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశంలో అధికారులు మండల కేంద్రంలోని కార్యాలయాలకు సక్రమంగా రాకుండా ఫీల్డ్ విజిట్‌ల పేరుతో అందుబాటులో ఉండడం లేదని ప్రజాప్రతినిధులు నిలదీసినా కొందరు అధికారుల్లో చలనం రావడం లేదు. బుధవారం ఎంఈఓ కార్యాలయం 12గంటలైనా తాళం తీయలేదు. ఎంఈఓ–1 తిరుపతిలో డీఎస్సీ–2025లో ఎంపికైన అభ్యర్థుల శిక్షణ కార్యక్రమ విధుల్లో తిరుపతిలో ఉండగా, ఎంఈఓ–2 దయాకర్, కార్యాలయ సిబ్బంది ఏ ఒక్కరూ కార్యాలయానికి రాకపోవడంతో కొందరు టీచర్లు, తల్లిదండ్రులు కార్యాలయానికి వచ్చి ఎవ్వరూ లేకపోవడంతో తిరుగుముఖం పట్టారు.

అలాగే పక్కనే ఉన్న మండల వ్యవసాయ కార్యాలయం ఎప్పుడూ మూసే ఉంటుందని, ఏఓ అందుబాటులో ఉండడం లేదని ఫిర్యాదులున్నాయి. ఫీల్డ్ విజిట్‌ల పేరుతో ఆమె మండల కార్యాలయానికి అసలు రావడం లేదని పలువురు రైతులు వాపోతున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో మండలస్థాయి అధికారులు ఇలా వ్యవహరిస్తున్నారని పలువురు పెదవి విరుస్తున్నారు.